

రైతు సదస్సులో శాస్త్రవేత్తలు, రైతులు

పంట మార్పిడితో అధిక దిగుబడి

అబ్దుల్లాపూర్‌మెట్, మే 21(ఆంధ్రజ్యోతి): పంట మార్పిడి విధానంతో దిగుబడి పెరగడంతో పాటు రైతుకు లాభం చేకూరుతుందని శాస్త్రవేత్తలు డాక్టర్ కె.కవిత, డాక్టర్ జెమీమా తెలిపారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మజీద్‌పూర్ గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు పేరుతో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పంటలకు రసాయన ఎరువులు తగ్గించి సేంద్రీయ ఎరువులను వినియోగించాలని రైతులకు సూచించారు. వ్యవసాయంతో పాటు చెట్లను పెంచి పర్యావరణ పరిరక్షణలో రైతులు భాగస్వామ్యం కావాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పల్లవి, మాజీ సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, ఏఈవో రఘుపతి, పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్, అనూష, ప్రవల్లికతో పాటు రైతులు పాల్గొన్నారు.



సీసీ కెమెరాలు, సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సుజాతనాయక్

దొంగతనాల నివారణకు సీసీ కెమెరాలు దోహదం

చంపాపేట, మే 21(ఆంధ్రజ్యోతి): కాలనీలలో దొంగతనాల నివారణకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సుజాతనాయక్ అన్నారు. హస్తినాపురం డివిజన్‌లోని విశ్వేశ్వరయ్య ఇంజనీర్స్ కాలనీలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ హాజరై కాలనీ ప్రతినిధులతో కలిసి సీసీ రోడ్లు, సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి మల్కాజిగిరి ఎంపీగా ఉన్న సమయంలో మంజూరు చేసిన నిధులతో కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు శశిదర్‌రెడ్డి, సీనియర్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, బ్రహ్మారెడ్డి, సతీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డి

కృష్ణానగర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

సైదాబాద్, మే 21(ఆంధ్రజ్యోతి): కాలనీలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం కృష్ణానగర్ కాలనీలో రూ.15.40లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు గోల్డ్ శ్రీను, జైపాల్‌రెడ్డి, సునీల్, ప్రవీణ్, సత్యం, నవీన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో వరద నివారణకు చర్యలు

చాదర్‌ఘాట్, మే 21 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాల కారణంగా జీహెచ్‌ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 పరిధిలోని డివిజన్ల వారీగా వరద నివారణకు ఐఆర్‌టీ (ఇన్‌సెంటివ్ రోడ్డు రిపేర్ టీమ్) ప్రత్యేక చర్యలు చేపట్టింది. ముగ్గురు సిబ్బందితో కూడిన ఒక్కో టీమ్ బుధవారం డివిజన్ల వారీగా పర్యటించింది. అకాల వర్షం కారణంగా మలక్‌పేటలోని అక్షయ్ హోటల్ ముందున్న ప్రధాన రహదారిపై వరద నీరు నిల్వకుండా మ్యాన్‌హోళ్లను శుభ్రం చేసే పనులు నిర్వహిస్తున్నారు. చాదర్‌ఘాట్ కాజ్‌వే, మలక్‌పేట ఆర్‌యూబీ, ముసారాంబాగ్ బ్రిడ్జికి వెళ్లే రోడ్డుపై వరద నీరు నిల్వ ఉన్న ప్రాంతాలకు ఐఆర్‌టీలు చేరుకునేలా చర్యలు చేపట్టినట్లు జీహెచ్‌ఎంసీ మలక్‌పేట సర్కిల్-6 ఈఈ పీర్ సింగ్ తెలిపారు.



మలక్‌పేటలో ప్రధాన రహదారిపై వరద నివారణకు చర్యలు చేపడుతున్న ఐఆర్‌టీ సిబ్బంది, ట్రాఫిక్ ఎస్‌ఐ రాము



డ్రైనేజీ మురుగు మళ్లింపు పనులను పర్యవేక్షిస్తున్న బీజేపీ నాయకులు

డ్రైనేజీ మురుగు మళ్లింపు పనులు ప్రారంభం

మన్సూరాబాద్, మే 21(ఆంధ్రజ్యోతి): డ్రైనేజీ మురుగునీరు మన్సూరాబాద్ పెద్దచెరువులోకి కలవకుండా మళ్లించేందుకు చేపట్టిన పనులను బుధవారం ప్రారంభించారు. ఇటీవల చెరువును పరిశీలించిన మన్సూరాబాద్ కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి చెరువులో చింతల్‌కుంట నుంచి వివిధ కాలనీలకు సంబంధించిన డ్రైనేజీ మురుగు వర్షపు నీరు నాలా గుండా పెద్దచెరువులో కలవడాన్ని గమనించారు. వెంటనే మురుగు నీరు కలవకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానికులు, కార్పొరేటర్ విజ్ఞప్తి మేరకు బుధవారం జలమండలి సిబ్బంది డ్రైనేజీ మురుగు మళ్లింపు పనులను చేపట్టారు. ఈ పనులను జలమండలి ఏఈ ప్రేమ్‌తో కలిసి డివిజన్ బీజేపీ అధ్యక్షుడు మునగాల హరీష్‌రెడ్డి, నాయకులు పాతూరి శ్రీధర్‌గౌడ్, శేఖర్, కాలనీవాసులు పర్యవేక్షించారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధుడు మృతి

వనస్థలిపురం, మే 21(ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ గుర్తుతెలియని వృద్ధుడు మృతిచెందిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 20న వనస్థలిపురం రైతుబజార్ సమీపంలో గుర్తుతెలియని వృద్ధుడు(60) స్పృహతప్పి పడిపోయాడని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. తక్షణమే ఘటనా స్థలానికి చెరుకున్న పోలీసులు సదరు వృద్ధుడిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. బుధవారం చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ఆయన మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన గుర్తు తెలియని వృద్ధుడు

మృత్యు మలుపులు

- కనిపించని ప్రమాద హెచ్చరిక బోర్డులు
- ఆయా శాఖల అధికారుల నిర్లక్ష్యానికి వాహనదారులు బలి

పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారుల మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. అవి వాహనదారుల పాలిట మృత్యు మార్గాలుగా తయారయ్యాయి. ఇప్పటికే ఆయా మలుపుల వద్ద పదుల సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు జరిగాయి. కొన్ని ఘటనల్లో కొందరు మృత్యువాత పడగా.. మరికొందరు కాళ్లు, చేతులు విరిగి దివ్యాంగులుగా మారారు. పదుల సంఖ్యలో మలుపుల వద్ద ప్రమాదాలు జరుగుతున్నా ఆర్‌అండ్‌బీ, పోలీస్, ట్రాఫిక్ అధికారులు నిర్లక్ష్యం వీడడం లేదు. కనీసం ఒక్క మలుపు వద్ద కూడా ప్రమాద సూచిక బోర్డులు కనిపించవు అంటే ప్రమాద ఘటనా స్థలాలపై ఆయా శాఖల అధికారుల నిర్లక్ష్యాన్ని అర్థం చేసుకోవచ్చు. బుధవారం కుంట్లూర్‌లో ముగ్గురు యువకులు మృత్యువాత పడిన మలుపు వద్ద కూడా ఏలాంటి హెచ్చరిక బోరులూ లేవు. ఇప్పటికైనా ఆయా శాఖల అధికారులు ప్రమాద స్పాట్‌లను గుర్తించి ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు. **అబ్దుల్లాపూర్‌మెట్, మే 21(ఆంధ్రజ్యోతి)**



గౌరెల్లి టు తట్టిఅన్నారం రేడియల్ రోడ్డులో కుత్బుల్లాపూర్ వెళ్లే దారి వద్ద ప్రమాదకరమైన మలుపు



కుంట్లూర్ నాలుగు రోడ్ల చౌరస్తాలో..



పెద్దఅంబర్‌పేట్ నుంచి కుంట్లూర్ రోడ్డులో అన్నదాత రైస్ మిల్ సమీపంలో ప్రమాదకర మలుపు



కుంట్లూర్‌లో బుధవారం ముగ్గురు యువకులు మృత్యువాత పడ్డ ప్రమాదకర మలుపు ఇదే..



కుంట్లూర్ నుంచి తట్టిఅన్నారం వెళ్లే రోడ్డులో ప్రమాదకర మలుపు, కనిపించని ప్రమాద హెచ్చరిక బోర్డులు

సరైన ఔట్‌లెట్ లేని పైప్‌లైన్ పనులు ఆపేయండి

- కార్పొరేటర్ పవన్‌కుమార్

కొత్తపేట, మే 21(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ నుంచి కొత్తపేట డివిజన్ కాలనీల మీదుగా మూసీ వరకు కోట్ల రుపాయల వ్యయంతో సరైన ఔట్‌లెట్ లేకుండా నిర్మిస్తున్న పైప్‌లైన్ పనులను ఆపేయాలని కార్పొరేటర్ పవన్‌కుమార్ డిమాండు చేశారు. బుధవారం ఆయన కామినేని చౌరస్తా వద్ద జరుగుతున్న పైప్‌లైన్ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాల వేళ సమీపంలోని భరత్‌నగర్ బస్తీ సహా న్యూనాగోల్, సమతాపురి తదితర కాలనీలకు వరద ముంపు ప్రమాదం ఉందని గుర్తు చేశారు. జీహెచ్‌ఎంసీ అధికారులు ఔట్‌లెట్‌ను పరిశీలించిన తర్వాత పనులు చేపట్టాలన్నారు.

900 ఎంఎం స్టార్మ్ వాటర్ డ్రెయిన్

కామినేని ఫ్లై ఓవర్ పిల్లర్ నెం.8, హెచ్‌పీ పెట్రోల్ బంకు ప్రాంతం నుంచి అభినంద్ గ్రాండ్ హోటల్ వరకు ఎల్బీనగర్ ఓల్డ్ విలేజీ(మజీద్‌గల్లీ) కల్వర్ట్ వరకు రూ 1.95 కోట్లతో 900 ఎంఎం స్టార్మ్ వాటర్ డ్రెయిన్ పనులు జరుగుతున్నాయని లింగోజిగూడ ఏఈ కీర్తి వివరించారు. 850 మీటర్ల మేర ఈ పనులు కొనసాగుతాయన్నారు. రాబోయే రోజుల్లో వరద ముంపును నివారించడానికి స్టార్మ్ వాటర్ డ్రెయిన్ ఉపకరిస్తుందని ఏఈ వివరించారు.



స్టార్మ్ వాటర్ డ్రెయిన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

కాంగ్రెస్‌లో పనిచేసే కార్యకర్తలకే గుర్తింపు, పదవులు

- పార్టీ మలక్‌పేట పరిశీలకులు

చాదర్‌ఘాట్, మే 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పటిష్ఠత కోసం, ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం పనిచేసిన నాయకులు, కార్యకర్తలకే పార్టీలో గుర్తింపు, పదవులు దక్కుతాయని ఆ పార్టీ మలక్‌పేట పరిశీలకులు సుబ్రహ్మణ్యప్రసాద్, ఎస్.సురేష్‌కుమార్ స్పష్టం చేశారు. బుధవారం మలక్‌పేట కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి షేక్ అక్బర్ అధ్యక్షతన చంచల్‌గూడలో జరిగిన మలక్‌పేట నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మలక్‌పేట నియోజకవర్గంలో పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన నాయకులు, కార్యకర్తలను గుర్తించి సీఎం రేవంత్‌రెడ్డికి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు నివేదికను అందజేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికీ మలక్‌పేటలో చాలామంది గ్రూప్ రాజకీయాలకు పాల్పడుతున్నారని, వాటిని పక్కన పెట్టి కాంగ్రెస్ పార్టీ పటిష్ఠత కోసం పనిచేసిన నాయకులు, కార్యకర్తలకే భవిష్యత్తు ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్ర, హైదరాబాద్ జిల్లా, మలక్‌పేట అసెంబ్లీ నియోజకవర్గం, డివిజన్ల వారీగా కమిటీల ఏర్పాటుపై కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం దృష్టి సారించిందన్నారు. మలక్‌పేట కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి షేక్ అక్బర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, అర్హులకు అందేలా తమ వంతు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బొల్లు కిషన్, ఐజాజ్ ఖాన్, అశ్వక్‌ఖాన్, గంట్ల కృష్ణ, మదన్‌బాబు, బాబు శ్రీనివాస్, మలక్‌పేట ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు సోహేల్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అవైసీ, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో నినాదాలు చేస్తున్న పార్టీ పరిశీలకులు సుబ్రహ్మణ్యప్రసాద్, సురేష్‌కుమార్, షేక్ అక్బర్ తదితరులు



హైదరాబాద్ లారీ సప్లయర్స్ అసోసియేషన్ సభ్యులను సన్మానిస్తున్న ట్రక్స్ యాప్ సభ్యులు

ట్రక్స్ యాప్ సేవలు సంతోషకరం

మన్సూరాబాద్, మే 21(ఆంధ్రజ్యోతి): భారతీయ రవాణా, పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఆవిర్భవించిన ట్రక్స్ యాప్ డిజిటల్ సంస్థ పూర్తి స్టాక్‌ను డిజిటల్ సేవల ద్వారా విస్తరించడం సంతోషకరమని హైదరాబాద్ లారీ సప్లయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పోకూరి శ్రీనివాస్‌బాబు పేర్కొన్నారు. లారీ, ట్రక్ డ్రైవర్లు, యజమానులు, రవాణా వాటాదారులకు శ్రీనివాస్‌బాబు నేతృత్వంలో బుధవారం ఆటోనగర్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో ట్రక్స్ యాప్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించడంతో పాటు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ట్రక్స్ యాప్ విధి విధానాలపై సౌత్ రీజనల్ బిజినెస్ హెడ్ ఎం.కార్తీక్, తెలంగాణ మేనేజర్ కుమ్మరి కుమార్ వివరించారు. అనంతరం అసోసియేషన్ సభ్యులను ట్రక్స్ యాప్ సభ్యులు సన్మానించి పోషకాహర ప్యాకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ లారీ సప్లయర్స్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి లగడపాటి వెంకట్రావు, కోశాధికారి శాగా కృష్ణారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

హనుమజ్జయంతికి ఏర్పాట్లు పూర్తి

- కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ ఈవో లావణ్య

చంపాపేట, మే 21(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని శ్రీ హనుమాన్ దేవస్థానంలో ఈ నెల 22న నిర్వహించనున్న హనుమజ్జయంతికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈవో లావణ్య తెలిపారు. గురువారం ఉదయం 5గంటలకు ధ్యానాంజనేయ స్వామికి ప్రత్యేక సింధూర అభిషేకం, 7గంటల నుంచి ఆకు పూజలు, అర్చనలు, 7:30గంటలకు మన్యుసూక్త హోమం, సాయంత్రం 6:30 గంటలకు స్వామి వారికి పల్లకిసేవ(ఊరేగింపు), 9గంటలకు మహాహారతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో పేర్కొన్నారు. భక్తుల ఏలాంటి ఇబ్బందులు కలగకుండా తాత్కాలిక క్యూలైన్లు, తాగునీరు, మజ్జిగ, ఉచిత ప్రసాదాలను అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఈవో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఈవో కోరారు.

కొత్తపేటలో పూజలు, హోమాలు

కొత్తపేట, మే 21(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్‌లోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో గురువారం హనుమజ్జయంతి సందర్భంగా స్వామి వారికి విశేష అర్చనలు పూజలు, మన్యుసూక్త హోమాలు నిర్వహించనున్నారు. స్నేహపురి కాలనీలోని పద్మావతీ గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని ప్రసన్నాంజనేయ స్వామి వారికి ఉదయం 5.30గంటల నుంచి 11 సార్లు పంచామృత అభిషేకం నిర్వహిస్తారు. ఆ తర్వాత 11 సార్లు శాస్త్రోక్తంగా హోమం చేస్తారు. సాయంత్రం ఆలయ గోదాగోష్టి భక్తులు స్వామివారికి పుష్పయాగం నిర్వహించనున్నారు. కొత్తపేటలోని భక్తాంజనేయస్వామి ఆలయం, ఎస్‌ఆర్‌ఎల్ కాలనీలోని ప్రసన్నాంజనేయ స్వామి, శ్రీరామ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయాల్లో స్వామి వారికి సింధూర ధారణ, తమలపాకులతో అలంకరణ పంచామృత అభిషేకాలు నిర్వహించనున్నారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి

సరూర్‌నగర్, మే 21(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా బుధవారం మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాపూర్ చౌరస్తాలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ మీర్‌పేట్ శాఖ చైర్మన్ మాదరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ మాజీ కార్పొరేటర్లు చల్లా కవితాబాల్‌రెడ్డి, గజ్జెల రాంచందర్, మాజీ సర్పంచ్ పల్లె పాండుగౌడ్, మాజీ ఎంపీటీసీ సిద్దాల దశరథ, నాయకులు శ్రీనివాస్‌నేత, ఓంప్రకాశ్, జానయ్య, కృష్ణ, మైత్రి, ఆనంద్, నరసింహరాజు, శేఖర్‌రెడ్డి, పరశురాం, భాస్కర్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



బాలాపూర్ చౌరస్తాలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు బాల్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు



రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న లింగాల కిషోర్‌గౌడ్ తదితరులు

కొత్తపేటలో..

కొత్తపేట, మే 21(ఆంధ్రజ్యోతి): రాజీవ్‌గాంధీకి బుధవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. రాజీవ్‌గాంధీ వర్ధంతి వేళ కొత్తపేట డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు లింగాల కిషోర్‌గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు శశిధర్‌రెడ్డి, రాష్ట్ర సేవాదళ్ నాయకులు షరీఫ్, నాయకులు కృష్ణారెడ్డి, బాషాగౌడ్, రమణ, జహంగీర్ బాబాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మహానాడు సాంస్కృతిక కార్యక్రమాల కమిటీ సభ్యుడిగా వెంకట్ గాంధీ

చాదర్‌ఘాట్, మే 21(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ మహానాడు సాంస్కృతిక కార్యక్రమాల కమిటీ సభ్యుడిగా తెలంగాణ రాష్ట్ర మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి వై.వెకంట్ గాంధీ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మహానాడు సాంస్కృతిక కార్యక్రమాల కమిటీని ప్రకటించారు. పార్టీ తనకు ఇచ్చిన బాధ్యతను క్రమశిక్షణతో నిర్వహిస్తానని వెంకట్ గాంధీ తెలిపారు. ఇందుకు పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు, పార్టీ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



వెంకట్ గాంధీ

సీపీఐ మీర్‌పేట్ కార్యదర్శిగా యాదమ్మ

సరూర్‌నగర్, మే 21(ఆంధ్రజ్యోతి): సీపీఐ మీర్‌పేట్ కార్పొరేషన్ శాఖ కార్యదర్శిగా మీర్‌పేట్‌కు చెందిన బండ యాదమ్మయాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రాచారి సమక్షంలో ఆమెను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆమెతో పాటు మరో పది మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మీర్‌పేట్ శాఖ కార్యదర్శి ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా సభ్యుడు శివానాయక్, నాయకులు పాండునాయక్, అంజయ్య, చత్రునాయక్ తదితరులు పాల్గొన్నారు.



యాదమ్మ

ఎస్‌జీపీఎఫ్‌డబ్ల్యూఏ ఆర్గనైజింగ్ సెక్రటరీగా రామచంద్రరావు

ఎల్బీనగర్, మే 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ ఫ్యామిలీ వెల్ఫేర్ అసోసియేషన్ (ఎస్‌జీపీఎఫ్‌డబ్ల్యూఏ) ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్.రామచంద్రరావు నియమితులయ్యారు. బుధవారం నియామక పత్రాన్ని ఎన్నికల అధికారి జీవీ హనుమంతరావు రామచంద్రరావుకు అందజేశారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన అసోసియేషన్ అధ్యక్షుడు శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి సుభాకర్‌రావులకు కృతజ్ఞతలు తెలిపారు.



రామచంద్రరావుకు నియామక పత్రం అందజేస్తున్న హనుమంతరావు



చిన్నారులకు టీకాలు వేస్తున్న వైద్యులు, సిబ్బంది

ఉచితంగా వ్యాక్సినేషన్

మన్సూరాబాద్, మే 21(ఆంధ్రజ్యోతి): నాగోల్ డివిజన్ రాక్‌టౌన్‌కాలనీ కమ్యూనిటీ హాలులో పుట్టిన బిడ్డ నుంచి 16 సంవత్సరాల వయసు గల వారికి బుధవారం ఉచితంగా వ్యాక్సినేషన్ చేశారు. రాక్‌టౌన్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఎర్ర వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో మన్సూరాబాద్‌లోని ప్రభుత్వ పట్టణ ఆరోగ్య కేంద్రం వారి సహకారంతో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించిన ఈ వ్యాక్సినేషన్‌లో 20మంది పిల్లలకు తమ తల్లిదండ్రులు టీకాలు వేయించారు. అదేవిధంగా ఆయుష్మాన్ భారత్ అనే హెల్త్ కార్డు అందించే ప్రక్రియలో భాగంగా సుమారు 350 మంది ఉచితంగా నమోదు చేయించుకున్నట్లు కాలనీ అధ్యక్షుడు వినోద్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రవికిరణ్

వారిపై పరువునష్టం కేసు వేస్తా: రవికిరణ్

వనస్థలిపురం, మే 21(ఆంధ్ర జ్యోతి): తన పరువుకు నష్టం కలిగించే వారిపై పరువునష్టం కేసు వేస్తానని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి, భూలక్ష్మీనగర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి రవికిరణ్ పొనుగుపాటి హెచ్చరించారు. బుధవారం హయత్‌నగర్ డివిజన్ భూలక్ష్మీనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాలనీ సంక్షేమ సంఘం సభ్యులతో కలిసి ఆయన మాట్లాడారు. భూలక్ష్మీనగర్ కాలనీకి చెందిన కొందరు చిన్నపిల్లలు కాలనీలో ఆడుకుంటుండగా సమీప కాలనీకి చెందిన వేణుగోపాల్ తన కుమారుడిని దుర్భాషలాడి అతనిపై చేయిచేసుకున్నాడని, ప్రశ్నించిన తనను కూడా దూషించాడని తెలిపారు. అనతరం వేణుగోపాల్ తనపై పోలీసులకు ఫిర్యాదు చేశాడని తెలిపారు. తన కుమారుడిపై దాడి చేసిన వేణుగోపాల్‌పై తాను కూడా పోలీసులకు ఫిర్యాదు చేయగా అతినిపై కూడా కేసు నమోదయ్యిందని తెలిపారు. ఈ విషయాన్ని అడ్డుపెట్టుకుని తమ కాలనీ సంక్షేమ సంఘం ఎన్నికల్లో ఓడిపోయిన కొంతమంది వ్యక్తులతో పాటు ఇతర కాలనీలకు చెందిన మరికొంతమంది వ్యక్తులు తన పరువుకు నష్టం జరిగేవిధంగా చిల్లర రాజకీయాలు చేయడం ఏంటని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు కె.శ్రీధర్, సహాయ కార్యదర్శి దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.